నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 17 ఆగస్టు 2024 | KAMAREDDY



Mirror TV @MirrorTvTelugu · 11h
మోడేగామ గ్రామంలోని ట్రాన్స్ఫార్మర్ కొన్ని రోజుల నుంచి మొరాయిస్తుందని లైన్ మెన్ కు తెలిపినా స్పందించలేదు

విద్యుత్ సమస్యలపై సబ్ స్టేషన్ లో పనిచేసే ముగ్గురు ఆపరేటర్లకు ఫోన్ చేస్తే.. వారు స్విచ్ఛాఫ్ చేసి పెడుతున్నారు

మీ సిబ్బంది @TG_NPDCL మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు

TGNPDCL @TG_NPDCL · 11h
Replying to @MirrorTvTelugu

Dear Sir,
Due to bird fault supply interrupted from 7.30hrs. to 8.30 hrs. TGNPDCL staff restored supply immediately after rectifying the fault....

## కాకులవల్లే కరెంట్ కోతలు

### తేల్చిన ట్రాన్స్కో అధికారులు

రామారెడ్డి, ఆగస్టు 16: కరెంటు కోతలకు కాకులు కారణమని ట్రాన్స్కో అధికారులు తేల్చారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని మోడేగామ రైతులు కరెంటు కోతలను నిరసిస్తూ 15వ తేదీన సబ్స్టేషన్ను ముట్టడించారు. దీంతో కోతలకు కారణాలు తెలుపాలని ఉన్నతాధికారులు వివరణ కోరారు. అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. సబ్స్టేషన్పరిధిలో కాకులు విద్యుత్ తీగలపై వాలడంతో కరెంటు కోతలు జరుగుతున్నాయని తేల్చారు. ఈ విషయాన్ని ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు సైతం ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు.



# ట్రాఫికర్పై కింకర్తవ్యం!

ట్రాఫిక్ పోలీసులు వర్సెస్ కార్పొరేషన్

- నగరంలో వాహనాల రద్దీ.. నియంత్రణపై కుంటి సాకులు
- వైఫల్యాలపై నోరు మెదపని అధికారులు
- పార్కింగ్ స్థలాలు లేకుండానే వాణిజ్య భవనాల నిర్మాణం
- సెల్లార్లలో యథేచ్ఛగా నిబంధనల అతిక్రమణ

*జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ పేరుతో ఎడాపెడా జరిమానాల పర్వానికి శ్రీకారం చుట్టిన పోలీసులతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. చట్టాన్ని అమలు చేయడంలో గుడ్డిగా ముందడుగు వేస్తుండగా రహదారులపై మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, కూడళ్ల వద్ద ఏర్పడిన అస్తవ్యస్థ పరిస్థితులపై ఎవరూ నోరు మెదపడం లేదు. వాహనాదారుడికి తెలియకుండా దొంగ చాటున ఫొటోలు తీసి పోలీస్ శాఖకు చెందిన వెబ్సైట్లో వివరాలు నమోదు చేసి సాయంత్రం మొబైల్ ఫోన్లకు ఈ -చలానా మెస్సేజ్ పంపిస్తున్నారు. దీంతో వాహనదారుడు కంగుతినాల్సి వస్తోంది. ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంలో నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతో పాటు పోలీసుల తీరు కూడా ఒక కారణంగానే కనిపిస్తోంది. ప్రతి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నప్పటికీ.. వైఫల్యాలను విస్మరిస్తూ ముందుకెళ్లడంపైనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.*
*–నిజామాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**నిజామాబాద్** నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా పెరగడంతోపాటు వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. విశాలమైన రోడ్లు కాస్తా రద్దీతో కుచించుకు పోతున్నాయి. ప్రస్తుతం 11 కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండగా..ఇందులో ఏ ఒక్కచోటా జీబ్రా క్రాసింగ్ మచ్చుకూ కనిపించడం లేదు. సీపీ క్యాంప్ కార్యాలయం, డీపీవోకు సమీపంలోని జంక్షన్లలోనూ జీబ్రా క్రాసింగ్ లేదు. దీంతో వాహనాల నిలుపడానికి వాహనదారులు తికమకకు గురవుతున్నారు. గందరగోళం మధ్యలోనే పోలీసు లు ఫొటోలు తీసి చలాన్లు వేస్తున్నారు. హెల్మెట్ ధారణపై నిబంధన అమలు చేస్తున్న పోలీసులు ఈ అంశాన్ని గాలికి వదిలేశారు. ప్రశ్నిస్తే అది తమ పరిధిలోనిది కాదని బదులిస్తున్నారు. నగరపాలక సంస్థ చేయాల్సిన పనికి పోలీస్ శాఖకు ఏం సంబంధం అంటున్నారు. జీబ్రా క్రాసింగ్ లైన్లు లేకపోవడంతో కూడళ్ల వద్ద వాహనాదారులు ముందుకొచ్చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసులు ఆశిస్తున్న లక్ష్యం నీరుగారడమే తప్ప ఎక్కడా నిబంధనలు అమలు కావడంలేదని ప్రజలు భావిస్తున్నారు.

### మూణ్ణాళ్ల ముచ్చటగా వన్ వే

ట్రాఫిక్ కూడళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందని పోలీస్ శాఖ చెబుతోంది. ఈ మొత్తాన్ని నగరపాలక సంస్థ ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ సంబంధిత పాలకవర్గం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ అంశంపై పోలీసులు పలుమార్లు వినతులు సమర్పించినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. పోలీస్ శాఖ, నగరపాలక సంస్థ మధ్య సమన్వయ లోపం చెడిపోవడం మూలంగా సామాన్యులు బలవుతున్నారు.ఓ వైపు పోలీస్ కమిషనర్ ఆదేశాలను అమలు చేయలేక, కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యాన్ని దాటుకుని ట్రాఫిక్ పోలీసు విభాగం సతమతమవుతున్నది. ఖలీల్వాడీ మీదుగా ఏడాది క్రితం అమలు చేసిన వన్ వే మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది. రాజకీయ ఒత్తిడితో రోజుల వ్యవధిలోనే వన్ వే ఎత్తేయడం విమర్శలకు తావిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణలో రాజీలేకుండా పని చేయాల్సి ఉండగా పోలీసుల తీరు అడుగడుగునా వివాదాస్పదమవుతున్నది. నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు జరిగితే నగరవాసులకు పట్టపగలే చుక్కలు కనిపించడం ఖాయం.

### పార్కింగ్ తలపోటు..



కార్పొరేషన్లో అక్రమార్కుల తీరుతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరగడానికి కారణంగా మారుతోంది. దవాఖానలు, ప్రైవేటు వ్యాపార సముదాయాలకు సెల్లార్ నిర్మాణం కచ్చితంగా అమలు చేయాలి. కానీ కొన్ని ప్రైవేటు దవాఖానల్లో సెల్లార్లలో ల్యాబ్లు, స్కానింగ్ సెంటర్లు, మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేశారు. భవన యజమానుల కక్కుర్తి, కార్పొరేషన్ అధికారుల చేతివాటంతో దవాఖానకు వచ్చే వాహనాదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తే సామాన్యుడికి జరిమానా విధిస్తున్నారు. పార్కింగ్ తలపోటుతో నిత్యం వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. గాంధీ చౌక్, నెహ్రూ చౌక్, పూసలగల్లి, కోటగల్లి, కుమార్గల్లిలో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. నగరానికి వివిధ అవసరాల కోసం వచ్చే లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు

### పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి...

నిజామాబాద్లో వాహనాల రద్దీకి తగ్గట్లుగా విరివిగా పార్కింగ్ స్థలాలే లేవు. నగరపాలక సంస్థ తరపున వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ నియంత్రణలో కాసింత ఉపశమనం ఉంటుంది. మరోవైపు వ్యాపార, వాణిజ్య భవనాల్లోని సెల్లార్లలో వాహనాల పార్కింగ్కు బదులుగా ఇతరత్రా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.దీంతో రోడ్లపై వాహనాలు వదిలేసి వెళ్తున్నారు. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. జనాల్లో మార్పు రావాల్సి ఉంది.

**- నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, నిజామాబాద్**

## రుణమాఫీ పేరిట రేవంత్ మోసం

ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మందికి దక్కని రుణమాఫీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల, పక్కన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- మాఫీ చేసింది కేవలం రూ.1281 కోట్లే
- 2016లోనే రూ.1571 కోట్లు మాఫీ చేసిన కేసీఆర్
- హరీశ్రావు తెలంగాణ ఉద్యమ సిపాయి
- సీమాంధ్రుల మోచేతి నీళ్లు తాగిన ఉద్యమ ద్రోహి రేవంత్
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్రెడ్డి

ఖలీల్వాడి, ఆగస్టు16 : రుణమాఫీ పేరిట సీఎం రేవంత్రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్రెడ్డి విమర్శించారు. రూ.2లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల ముందు కల్లబొల్లి వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను నిలువునా ముంచేసిన రేవంత్ సర్కారుపై ప్రజలందరూ తిరగబడాలన్నారు. ఎక్కడికక్కడా నిరసనలు వ్యక్తం చేస్తూనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను నిలదీయాలంటూ పిలుపునిచ్చారు.శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంతటా తిరుగుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమా ణం చేసి మాట తప్పిన రేవంత్ రెడ్డి తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. దేవుళ్లపై ఒట్టేసి అబద్ధాలు ఆడుతున్న ఇలాంటి ముఖ్యమంత్రిని తన జీవితంలో చూడలేదని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలు, రైతులను మోసం చేశారని మండిపడ్డారు. వంద రోజుల్లో రుణమాఫీతోపాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని చెప్పి రెండోసారి రైతులను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మళ్లీ మాట తప్పి పార్లమెంట్ ఎన్నికల్లో ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని ఓట్లు దండుకుని మూడోసారి రేవంత్రెడ్డి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీశ్రావుపై నీచాతి నీచంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని వేముల తప్పుబట్టారు. మంత్రి పదవులను గడ్డిపోచ మాదిరిగా రాజీనామా చేసి వదిలేసిన చరిత్ర హరీశ్రావుకు ఉంటే, సీమాంధ్ర నేతల అడుగులకు మడుగులు ఒత్తి, వారి మోచేతి నీళ్లు తాగిన చరిత్ర ఉద్యమ ద్రోహి రేవంత్ రెడ్డిదని ఘాటుగా విమర్శించారు.

### కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీలో రేవంత్ రుణమాఫీ ఎంత ?

రుణమాఫీ విషయంలో రేవంత్రెడ్డి సర్కార్ రైతులను నిలువునా మోసం చేసిందని వేముల లెక్కలతో సహా వివరించారు. 2016లో ఉమ్మడి జిల్లాలో 3 లక్షల 79 వేల 520 మంది రైతులకు రూ.1571.25 కోట్ల రుణమాఫీ చేస్తే.. 2024 లో రేవంత్రెడ్డి సర్కార్ ఉమ్మడి జిల్లాలో కేవలం రూ.1281 కోట్ల రుణమాఫీ మాత్రమే చేసిందని వివరించారు. రుణమాఫీపై రేవంత్ సర్కార్ రైతులను నిలువునా మోసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద రైతులతో కలిసి ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ ధర్నాకు బాల్కొండ నియోజకవర్గానికి చెందిన రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొత్తూర్ లక్ష్మారెడ్డి, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్రెడ్డి, సుజిత్సింగ్ ఠాకూర్, మురళి, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

### సకాలంలో జీతాలిచ్చే పరిస్థితిలేదు

బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ మాజీ చైర్మన్



ఆర్టీసీలో కార్మికులకు సకాలంలో జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలుచేస్తున్న ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2వేల కోట్లు బకాయిలు పడిందని తెలిపారు. ప్రతి నెలా బకాయిలను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పి , తీరా నిధులు కేటాయించక పోవడంతో 43వేల మంది కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని, అరకొర బస్సులు కాకుండా డిమాండ్కు తగ్గట్లుగా బస్సులను తిప్పాలని డిమాండ్ చేశారు. మహిళా లోకమంతా రేవంత్ రెడ్డి తీరును ఎండగట్టాలన్నారు.



కోల్కతా ఘటనకు నిరసనగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

## 24 గంటల పాటు ఓపీ సేవలు బంద్

ఖలీల్వాడి/కామారెడ్డి, ఆగస్టు 16: కోల్కతాలోని ఆర్జీ కార్ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా నేడు దేశవ్యాప్తంగా అన్ని దవాఖానల్లో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ ప్రకటించింది. ఇందులోభాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉద యం 6 గంటల వరకు వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు కామారెడ్డి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమ ణ, కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.అత్యవసర సేవలు మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు

## బదిలీ ఉత్తర్వులు నిలిపివేత!

### ఎక్కడి సీఐలు అక్కడే కొనసాగాలి సీపీ ఆదేశాలు జారీ ?

వినాయక్నగర్, ఆగస్టు 16 : మల్టీజోన్–1 పరిధిలో 8 మంది సీఐలను బదిలీచేస్తూ ఐజీ చంద్రశేఖర్రెడ్డి ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు తమకు కేటాయిందిన సర్కిల్కు వెళ్లి రిపోర్టు చేయాలని సీపీ కల్మేశ్వర్ సైతం సూచనలు చేశారు. ట్రాన్స్ఫర్స్ ఆర్డర్ వెలువడిన కొన్ని గంటల అనంతరం బదిలీ అయిన సీఐలు ఇక్కడి నుంచి వెళ్లవద్దని, ఎవరిస్థానంలో వారు విధులు నిర్వర్తించాలని సీపీ ఆదేశాలు చేసినట్లు సిబ్బంది ద్వారా తెలిసింది. ఆర్డర్స్ వెలువడి మూడు రోజులు గడిచినా సీఐలు రిలీవ్ కాకపోవడంతో ఇప్పట్లో బదిలీలు ఉండవా అనే చర్చ పోలీసుశాఖలో జరుగుతున్నది.

**ఇరువురి మధ్య నలిగిపోతున్న పోలీసులు...**
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్లో విచిత్రకరమైన పరిస్థితి నెలకొన్నది. ఖాకీ వర్సెస్ ఖద్దర్ అన్నట్లుగా వ్యవహారం నడుస్తోంది. ఓవైపు పోలీస్ ఉన్నతాధికారులు, మరోవైపు అధికార పార్టీ నేతల మధ్య బయటపడని వైరం కనిపిస్తోంది. అధికార పార్టీ నేతల మాటను అమలు చేయలేక, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించలేక సతమతం అవుతున్నారు. ఓ వైపు అధికార పార్టీ నేతల ఆదేశాలు అమలు చేస్తే ఏదో ఒక కారణంతో అటాచ్మెంట్లు ఎదుర్కోవడంతో పాటు బదిలీలు తప్పడం లేదు. నేతల మాటను పెడచెవిన పెడితే వారి ఆగ్రహానికి గురి కావాల్సి వస్తోంది. ఇలా అరకత్తెరలో పోకచెక్క మాదిరిగా పోలీసులు నలిగి పోతున్నారు.

## దవాఖానల్లో సమస్యలను పరిష్కరిస్తాం

తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్కుమార్


బాన్సువాడ దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న టీవీవీపీ కమిషనర్ అజయ్కుమార్

బాన్సువాడ/బోధన్, ఆగస్టు 16: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో నెలకొన్న సమస్యలు, మందుల కొరత, వైద్యుల నియామకం తదితర అంశాలను ప్రభుత్వాకి నివేదించి పరిష్కారం కోసం కృషి చేస్తానని వైద్య విధాన పరిషత్ కమిషనర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దవాఖానల నోడల్ అధికారి అజయ్కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడ, బోధన్ దవాఖానలను తనిఖీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లోని సమస్యలు, రోగుల ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో వైద్య శాఖ కమిషనర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ముందుగా బాన్సువాడ దవాఖానలోని అన్ని వార్డులను పరిశీలించారు. పిల్లల వార్డులో ఒక్కోబెడ్పై ఇద్దరు చిన్నారులను పడుకోబెట్టి ఉండడం గమనించారు. అనంతరం రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో వార్డులను పరిశీలించిన అనంతరం, దవాఖాన అధికారులు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని దవాఖానల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపా రు. బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కమిషనర్కు సిబ్బంది వినతి పత్రం అందజేశారు.

## రేపు అలీసాగర్ నీటి విడుదల

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నవీపేట,ఆగస్టు 16: మండలంలోని కోస్లీ గోదావరి మొదటి పంపుహౌస్ నుంచి అలీసాగర్ నీటి విడుదలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆగస్టు నెల ప్రారంభమవుతున్నా.. రైతాంగానికి కీలకమైన అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో నీళ్లను ఎత్తిపోయడమే అధికారులు మరిచిపోయారు. వానలు సమృద్ధిగా కురిసి చెరువుల్లోకి నీళ్లు చేరితే లిఫ్టులతో పనిలేదు. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాకు అలీసాగర్, గుత్ప ఎత్తిపోతలే ఆయువు పోస్తాయి. ఆగస్టు 8న షెడ్యూల్ ప్రకారం లిఫ్టులు రన్ చేయాల్సి ఉండగా నీటి పారుదల శాఖ నిర్ణయాన్ని అమ లు చేయడం లేదు. దీనిపై ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఎత్తి' పోస్తారా? 'చేతి' స్తారా? శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికార యంత్రాంగం స్పందించింది.ఈ నెల 18న స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డి చేతుల మీదుగా నీటిని విడుదల చేయనున్నట్లు అలీసాగర్ లిఫ్టు ఏఈ ప్రణయ్రెడ్డి శుక్రవారం తెలిపారు. ఒకవేళ వర్షాలు విస్తృతంగా కురిస్తే మరో తేదీకి వాయిదా వేస్తామని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా పంటల సాగు జోరుగా సాగుతున్న తరుణంలో నవీపేట, మాక్లూర్, నిజామాబాద్, ఎడపల్లి, డిచ్పల్లి,రెంజల్ మండలాల్లోని 53,793 ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా.. ప్రతి ఏటా 47 వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతున్నది. అలీసాగర్ లిఫ్టు ద్వారా నీటి విడుదలకు ముహూర్తం ఖరారు కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు

## ఉమ్మడి జిల్లాలో జోరువాన

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కాగా..మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. కామారెడ్డి పట్టణంలోని పలు రోడ్లు చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. రాజంపేట మండల కేంద్రంలో వర్షానికి రోడ్డుకు అడ్డంగా ఓ వేప చెట్టు విరిగి పడగా.. పోలీసులు స్థానిక యువకుల సాయంతో తొలగించారు.
– కామారెడ్డి/ఖలీల్వాడి/ రాజంపేట, ఆగస్టు 16


రాజంపేటలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు, యువకులు


కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాలువను తలపిస్తున్న రోడ్డు


నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జలమయమైన రోడ్డు